https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

## తాజా తెలుగు వార్తలు


ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

1 PM TO 4 PM

సంపుటి: 01 / సంచిక:20 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / శనివారం, సెప్టెంబర్ 05,2026

# కాంగ్రెస్ పార్టీని నిషేధిత జాబితాలో పెట్టే రోజు దగ్గరలోనే ఉంది : కేటీఆర్



ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 5

యూత్ డిక్లరేషన్‌లో 24 హామీలు ఇచ్చారు.. ఒక్కటంటే ఒక్కటి అమలు కూడా చేయలేదని అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 100 రోజుల్లో అన్నీ అమలు చేస్తామని డైలాగులు కొట్టారు.. 1000 రోజులు అయిపోయింది.. 100 రోజులకు 10 రెట్లయింది.. ఏం చేసినవయా..? చెప్పు అంటే ఏమీ లేదన్నారు.బకాసురుల్లాగా మేస్తున్నరు.. కుంభకర్ణుల్లాగా పంటున్నరు.. పందికొక్కుల్లాగా తింటున్నరు... అది తప్పు ఏదీ లేదు చేసింది.. ఇక మీదికెళ్లి.. తిన్నది అరగక కేసీఆర్ రాజీనామా చేయాలని తీట మాటలు మాట్లాడుతున్నారు.. ఎవరు చేయాలే.. ఎందుకు చేయలే రాజీనామా..? అని నేను అడుగుతున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాల్నా.. మీరు చెప్పాలే.. ఎవరు చేయాలే రాజీనామా.. అని కేటీఆర్ అడిగితే.. విద్యార్థులంతా ముక్తకంఠంతో రేవంత్ రెడ్డి అంటూ సమాధానమిచ్చారు. 100 రోజులు అని చెప్పి 1000 రోజులు మోసం చేసిన ధోకేబాజ్ (మోసగాడు)రాజీనామా చేయాల్నా లేదా.. అని అడిగారు. నిరుద్యోగులను నిండా ముంచిన లఫంగా పార్టీ కాంగ్రెస్ ఇయ్యాళ్ల పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతోందన్నారు.ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదు.. మీ కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని కేటీఆర్ ఫైర్ అయ్యారు. పేద ప్రజల భూములతో ఇవాళ కాంగ్రెస్ పార్టీ చెలగాటమాడుతోంది. కోట్ల ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెట్టిన కాంగ్రెస్ పార్టీ.. మీ పార్టీని నిషేధిత జాబితాలో పెట్టే రోజు దగ్గరలో ఉందని కేటీఆర్ హెచ్చరించారు. 365 రోజుల్లో 2 లక్షల ఉద్యోగాలిస్తాం.. అని మా తమ్ముళ్లు, చెల్లెళ్లను మోసం చేసి వాళ్లు పోయి వాళ్ల తల్లిదండ్రులు, అత్తామామలు, తాత నాయినమ్మల కాళ్లు మొక్కేటట్టు చేసి కాంగ్రెస్‌కు ఓటేయించుకుని మోసం చేసినందుకు, బాండ్ పేపర్ రాసి మోసం చేసిన సన్నాసులకు తప్పకుండా భరతం పట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

# నేపాల్ టన్నెల్‌లో సజీవంగా చైనీస్ దేశస్థుడు..

## శిథిలాల కింద ప్రాణాలతో 64 ఏళ్ల మహిళ

కాట్మాండు: ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 5

నేపాల్‌లో వరదల్లో చిక్కుకున్న మరో ఇద్దర్ని ఇవాళ రక్షించారు. త్రిశూలీ టన్నెల్ నుంచి ఓ చైనీస్ దేశస్థుడిని కాపాడారు. వరదలు సంభవించిన పది రోజుల తర్వాత ఆ చైనా దేశస్థుడు టన్నెల్‌లో సజీవంగా ఉన్నాడు. చికత్స కోసం అతన్ని కాట్మాండుకు తరలించినట్లు నేపాలీ ఆర్మీ ప్రకటించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న జలవిద్యుత్తు టన్నెల్‌లో చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు భారీ ఆపరేషన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. సుమారు 900 మంది కార్మికులు వివిధ టన్నెల్స్‌లో ఉండి ఉంటారని భావిస్తున్నారు. ఆగస్టు 26వ తేదీన సంభవించిన నేపాల్ జల విలయంలో సుమారు 1300 మంది ప్రాణాలు కోల్పోయారు, మరో 5 వేల మంది మిస్సింగ్ అయ్యారు.భారత, నేపాలీ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నాయి. శుక్రవారం 9వ రోజు ఇద్దరు నేపాలీ దేశస్థులను త్రిశూలీ టన్నెల్ నుంచి సజీవంగా రక్షించిన విషయం తెలిసిందే.



# సహరన్‌పూర్ కలెక్టరేట్లో మసీదు.. భారీ భద్రత నడుమ కూల్చివేత

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 5

కూల్చివేశారు. భారీ భద్రత నడుమ శనివారం ఈ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. సహరన్‌పూర్‌ని కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఒక మసీదు చాలా కాలంగా ఉంది. అయితే, ఆ మసీదు ఉన్న స్థలం ప్రభుత్వ భూమి. ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా ఈ మసీదు కొనసాగుతోంది. దీంతో ఈ మసీదును తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.అయితే, ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కొందరు ముస్లిం నేతలు కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు పిటిషనర్లకు వ్యతిరేకంగా తీర్పునిచ్చింది. ఎలాంటి అనుమతులు లేకుండా, అక్రమంగా ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఈ మసీదును కూల్చివేసేందుకు గత జూలైలో అనుమతించింది. దీంతో ఈ ఆదేశాల్ని సవాలు చేస్తూ ముస్లిం సంఘాలు జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. అక్కడ కూడా పిటిషనర్లకు ఎదురుదెబ్బ తగిలింది. కింది కోర్టు ఇచ్చిన ఆదేశాల్ని సమర్థించింది. మసీదు కూల్చివేసేందుకు అనుమతించింది.ఈ మేరకు జిల్లా జడ్జి సతేంద్ర కుమార్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్రవారం రాత్రి మసీదును అధికారులు సీజ్ చేశారు. శనివారం మసీదును కూల్చివేసే చర్యలు చేపట్టారు. కలెక్టర్ కాంప్లెక్స్‌లోకి చేరుకున్న బుల్డోజర్లు మసీదును కూల్చివేశాయి. ఈ సమయంలో జిల్లా కలెక్టరేట్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు అక్కడే ఉన్నారు. మరోవైపు ఎటువంటి ఆందోళనలు తలెత్తకుండా కలెక్టరేట్ ప్రాంతంతోపాటు నగరంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ అంశంపై సహరన్‌పూర్ డీఐజీ అభిషేక్ సింగ్ మాట్లాడుతూ.. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా మసీదును తొలగించామన్నారు.అయితే, మసీదు కూల్చివేతను అడ్డుకునేందుకు వెళ్లేందుకు సిద్ధమైన తనను పోలీసులు హౌజ్ అరెస్టు చేశారని, సమాజ్‌వాదీ పార్టీ నేత, లోక్‌సభ ఎంపీ ఇర్కా హసన్ ఆరోపించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా గట్టి, భద్రత నడుమ ఈ కార్యక్రమం సాగింది.



# ఇరాన్ యుద్ధ రహస్యాలు ఎలా లీకవుతున్నాయి..

## మిలటరీ అధికారులకు ట్రంప్ లైడిటెక్టర్ పరీక్షలు



ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 5


అమెరికా--ఇరాన్ యుద్ధానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని మీడియాకు ఎవరు లీక్ చేస్తున్నారు? అమెరికా రక్షణ శాఖలో ఇప్పుడు ఇదే ప్రశ్న కలకలం రేపుతోంది.

ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా కీలక ఆయుధాల నిల్వలు తగ్గిపోతున్నాయంటూ వరుస కథనాలు వెలువడటంతో.. వాటి మూలాలను గుర్తించేందుకు అమెరికా రక్షణ మంత్రిత్వ కార్యాలయం పెంటగాన్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా యూఎస్ మిలటరీ జాయింట్ స్టాఫ్‌కు చెందిన సుమారు 50 మంది సైనిక, పౌర సిబ్బందికి పాలిగ్రాఫ్ (లై డిటెక్టర్) పరీక్షలు నిర్వహించినట్లు ది న్యూయార్క్ టైమ్స్‌ను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా వెల్లడించింది.

### కీలక సమాచారం బయటకు వెళ్లిందా?

ఇరాన్‌తో జరుగుతున్న ఘర్షణ నేపథ్యంలో అమెరికా వద్ద దీర్ఘశ్రేణి క్షిపణులు, పేట్రియట్ ఇంటర్‌సెప్టర్లు వంటి కీలక ఆయుధాల నిల్వలు తగ్గుతున్నాయంటూ ఇటీవల పలు మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. ఈ కథనాల వెనుక రక్షణ శాఖలోని వ్యక్తులే సమాచారాన్ని అందించారా అన్నదానిపై దర్యాప్తు సాగుతోంది. ఈ క్రమంలోనే మీడియాకు రహస్య సమాచారాన్ని అందించారా? ముఖ్యంగా అమెరికా వద్ద ఉన్న కీలక ఆయుధాల నిల్వలు గణనీయంగా తగ్గాయన్న వివరాలను వెల్లడించారా? అనే కోణంలో అధికారులు సిబ్బందిని ప్రశ్నించినట్లు సమాచారం.ఆగస్టులో ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలుస్తోంది. జాయింట్ స్టాఫ్‌లో సుమారు 1,500 నుంచి 2,000 మంది అధికారులు, సిబ్బంది పనిచేస్తుండగా.. వారిలో సుమారు 50 మందిని పరీక్షలకు గురిచేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.పెంటగాన్ అధికార ప్రతినిధి సీన్ పార్నెల్ మాత్రం అంతర్గత సిబ్బంది, దర్యాప్తు అంశాలపై మాట్లాడేందుకు నిరాకరించారు. అయితే జాతీయ భద్రతకు సంబంధించిన రహస్య సమాచారం లీక్ కావడాన్ని అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నామని, అందుకు అనుగుణంగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# 284 సార్లు ఎన్నికల బరిలో నిలిచిన ధర్తి పకడ్ కన్నుమూత..!





ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 5

భారతదేశ ఎన్నికల చరిత్ర లో తనకంటూ ఓ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న యోధుడు, 'ధర్తి పకడ్ ' గా పేరుగాంచిన 96 ఏళ్ల నాగర్‌మల్ బాజోరియా ఇక లేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పట్నాలోని మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. వందలసార్లు ఎన్నికల బరిలో నిలిచి, ఒక్కసారి కూడా గెలువకపోయినప్పటికీ.. ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనడమే ముఖ్యమని చాటిచెప్పారు. ఆయన మృతితో ఇప్పుడు ఒక శకం ముగిసినట్లయ్యింది.1930లో లాహోర్‌లో జన్మించిన నాగర్‌మల్ కుటుంబం.. దేశ విభజనకు ముందే బిహార్‌లోని భాగల్‌పూర్‌కు వలస వచ్చింది. అక్కడ వ్యాపారం చేస్తూనే ఆయన సామాజిక కార్యకర్తగా పేరు తెచ్చుకున్నారు. వార్డు స్థాయి ఎన్నికల నుంచి విధానసభ, లోక్‌సభ, ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి పదవుల వరకు సుమారు 280కి పైగా ఎన్నికల్లో ఆయన పోటీ చేశారు. ఓటమి ఎదురైన ప్రతిసారి "నేను ఎన్నికల్లో ఓడిపోను, ప్రజలే ప్రతిసారి ఓడిపోతున్నారు" అని చెప్పేవారు. తన ఓటమిని ఆయన ఎప్పుడూ అంగీకరించలేదు.దేశ రాజకీయాల్లో దిగ్గజాలుగా వెలిగిన ఇందిరా గాంధీ (రాయ్‌బరేలి), రాజీవ్ గాంధీ (అమేథి), అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ, ప్రణబ్ ముఖర్జీ వంటి వారిపై కూడా ఆయన పోటీకి నిలిచారు. 1997లో వాజ్‌పేయికి వ్యతిరేకంగా 100 గాడిదలతో ప్రచారం నిర్వహించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. 1969లో రాష్ట్రపతి అభ్యర్థి వీవీ గిరిపై నామినేషన్ వేయడంతోపాటు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో 17-18 సార్లు తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు.రాజకీయాల్లోనే కాకుండా సామాజిక సేవలోనూ బాజోరియా చురుగ్గా పాల్గొన్నారు. పేద యువతులకు సామూహిక వివాహాలు జరిపించడం, వరకట్న రహిత వివాహాలను ప్రోత్సహించడం, తాగునీటి కోసం ట్యూబ్‌వెల్స్ ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. పట్నా నుంచి ఆయన భౌతికకాయాన్ని భాగల్‌పూర్‌కు తరలించారు. శుక్రవారం ఆయన నివాసం నుంచి వేలాది మంది అనుచరుల మధ్య అంతిమయాత్ర నిర్వహించి, బరారీ ఘాట్‌లో అంత్యక్రియలు జరిపించారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

# కోవిడ్ టీకాలతో 28 మంది సైనికులు మృతి : అమెరికా ఆర్మీ డాక్టర్



న్యూయార్క్: ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 5

కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల 28 మంది సైనికులు మృతిచెందినట్లు ఓ అమెరికా ఆర్మీ డాక్టర్ కోర్టులో తెలిపారు. దీనిపై పొలిటికో వార్తాసంస్థ ఓ కథనాన్ని రాసింది. కోవిడ్ టీకా వల్ల సుమారు 2544 మంది మృతిచెందిన ఘటనలో అమెరికా ప్రభుత్వం దర్యాప్తు చేపడుతున్నది. అమెరికా ఆరోగ్యశాఖ మంత్రి రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్‌కు అడ్వైజర్‌గా చేస్తున్న థెరిసా లాంగ్ ఈ విషయాన్ని వర్జీనియా కోర్టులో చెప్పినట్లు తెలుస్తోంది. వ్యాక్సిన్ అడ్వర్స్ ఈవెంట్ రిపోర్టింగ్ సిస్టమ్‌కు సుమారు 2544 మృతుల సమాచారం అందినట్లు లాంగ్ తన వాంగ్మూలంలో వెల్లడించారు.మిలిటరీ సిబ్బంది కోవిడ్ టీకా తీసుకోవాలని మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ఆదేశించారు. లేదంటే విధుల నుంచి తొలగిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కోవిడ్ టీకా తీసుకోని 9వేల మందిని తొలగించారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

నెల్లూరు సీటీ ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 5:

డాక్టర్ కొండూరు హరినారాయణ రెడ్డి మరియు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం నెల్లూరు పోస్టల్ కాలనీ లోని హరినారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం నందు మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయులను సత్కారించడం జరిగింది. ఈసందర్భంగా కంచి డోమినిక్ రెడ్డి, డాక్టర్ చీదరాల చెన్నయ్య, చంద్రాయుడు లను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ కొండూరు హరినారాయణ రెడ్డి, కె.మురలీమోహన్ రాజు, జబి.గురుమూర్తి, డాక్టర్ గుంజి నరసింహారావు, పాయసం వెంకటేశ్వర రావు, నెల్లూరు సుధాకర్ రెడ్డి, ఎ.జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై ఓయూ లో బీఆర్ఎస్వీ నిరసన

హైదరాబాద్,ఉస్మానియా యూనివర్సిటీ, ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 5:

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపిస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎన్సీసీ గేట్ వద్ద చేపట్టిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ మాట్లాడుతూ.. "1000 రోజులు.. 1000 దరిద్రాలుగా పాలన సాగుతోంది" అని విమర్శించారు.జాబ్ క్యాలెండర్ జాబ్‌లెస్ క్యాలెండర్‌గా మారిందని, రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ఊసే లేదని ఆరోపించారు. రాజీవ్ యువ వికాసం అమలు కు నోచుకోలేదన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందడం లేదని, విద్యాదీవెన పథకం హామీగానే మిగిలిందని విమర్శించారు. మహిళా విద్యార్థులకు ఇస్తామన్న స్కూటీల పంపిణీపై కూడా స్పష్టత లేదన్నారు.విద్యాశాఖకు 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి కనీసం ఏడు శాతం కూడా కేటాయించడం లేదని దశరథ్ ఆరోపించారు. 'మాట్లాడితే కేసులు.. కొట్లాడితే జైళ్లు" అన్న చందంగా కాంగ్రెస్ పాలన సాగుతోందని విమర్శించారు. విద్యార్థుల హక్కులు, యువత భవిష్యత్తు, మహిళా విద్యార్థుల గౌరవం కోసం ప్రశ్నించే గొంతుకగా బీఆర్ఎస్వీ పోరాటం కొనసాగిస్తుందని దశరథ్ స్పష్టం చేశారు.



# ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడులు.. ఆయిల్ ట్యాంకర్‌పై దాడి చేసిన యూఎస్

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 5

అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధం మరింత తీవ్రమవుతోంది. ఇరాన్‌కు చెందిన ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడి చేసింది. ఖర్గ్ ఐలాండ్ వద్ద ఉన్న ఒక ఆయిల్ ట్యాంకర్‌పై అమెరికా మిస్సైల్ దాడి చేసింది. ఇరాన్ తీరానికి ఖర్గ్ ఐలాండ్ 33 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇరాన్ నుంచి చమురు రవాణాకు ఈ దీవి చాలా కీలకం. ఇక్కడినుంచే క్రూడాయిల్‌ను ఇరాన్.. విదేశాలకు తరలిస్తుంది.అందుకే, అమెరికా.. ఈ దీవిని లక్ష్యంగా ఎంచుకుని దాడి చేస్తోంది. ఇరాన్‌పై దాడి చేస్తామని శుక్రవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఇరాన్‌లోని పిక్కేక్స్ పర్వత ప్రాంతంలో ఉన్న భూగర్భ అణు కేంద్రంపై దాడి చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ అణ్వాయుధం తయారు చేయకుండా నిరోధించాలనేదే తమ లక్ష్యమని ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఈ వార్నింగ్ ఇచ్చిన తర్వాత కొన్ని గంటల్లోనే ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా నాలుగు మిస్సైళ్లతో దాడి చేసింది. ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి.తాజా దాడికి సంబంధించి జరిగిన నష్టంపై ఎలాంటి ప్రకటనా రాలేదు. అటు అమెరికా.. ఇటు ఇరాన్.. ఈ దాడిపై ఇంకా స్పందించలేదు. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. దక్షిణ లెబనాన్‌లోని అలి తాహెర్ ప్రాంతాన్ని 'ఆపరేషన్ కంట్రోల్' ద్వారా అధీనంలోకి తెచ్చుకున్నామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఉగ్రవాద సంస్థ హెజ్‌బొల్లాకు చెందిన భూగర్భ స్థావరాలు, ఆయుధ భాండాగారం వంటివి ఈ ప్రాంతంలోనే ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.



# నాచారం నుండి ఉప్పల్ వెళ్ళే వాహనాలకు ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయాలి

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

హైదారాబాద్,నాచారం, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 5:

నాచారం నుంచి ఉప్పల్ వైపు వెళ్లే వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని హబ్సిగూడ చౌరస్తాలో ప్రత్యేక ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి సమస్యను వివరించారు. నాచారం నుంచి ఉప్పల్, తార్నాక వైపు నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో హబ్సిగూడ చౌరస్తా వద్ద తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. సిగ్నల్ వద్ద వాహనదారులు 10 నుంచి 12 నిమిషాల వరకు వేచి ఉండాల్సి వస్తోందన్నారు. రద్దీ సమయాల్లో హబ్సిగూడ నుంచి హెచ్ఎంటీ నగర్ కమాన్ వరకు వాహనాలు బారులు తీరుతున్నాయని పేర్కొన్నారు. ఉప్పల్ వైపు వెళ్లే వాహనాలకు ప్రత్యేక ఫ్రీ లెఫ్ట్ లేకపోవడం వల్ల సిగ్నల్ కోసం వేచి ఉండాల్సి వస్తోందన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఫ్రీ లెఫ్ట్‌కు అవసరమైన మేర రహదారిని విస్తరించాలని కోరారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్‌లు ఆక్రమణలకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిని పరిశీలించి ఆక్రమణలు తొలగించి వాహనదారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు.ఎమ్మెల్యే విజ్ఞప్తిపై కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించి, త్వరలో నియోజకవర్గంలోని ఫ్రీ లెఫ్ట్‌లను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, విఠల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# ఆగి ఉన్న లారీపైకి దూసుకెళ్లిన కారు..

## ఎనిమిది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 5

కేరళలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని ఒక కారు ఢీకొనడంతో కారులోని ఎనిమిది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. ఈ ఘటన కేరళలోలని త్రిశూర్ జిల్లాలో, శుక్రవారం రాత్రి 11.40 గంటలకు జరిగింది. మృతులంతా తమిళనాడుకు చెందినవారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలివి.తమిళనాడు, దిండిగల్‌లోని పీఎస్ఎన్ఏ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థులు కేరళలోని గురువాయూర్ నుంచి కొడుంగల్లూర్ వెళ్తున్నారు. ఇదే సమయంలో 66వ జాతీయ రహదారిపై పనంబిక్కున్ను వద్ద ఒక లారీ శుక్రవారం రాత్రి రోడ్డుపై ఆగిపోయింది. విద్యార్థులు వెళ్తున్న కారు వెనుక నుంచి వచ్చి, ఆగి ఉన్న లారీని ఢీకొంది. కారు అతి వేగంగా ఉండటం వల్ల లారీని ఢీకొనడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ ఘటనలో కారులోని 8 మంది విద్యార్థులు మరణించారు. కారు నుజ్జునుజ్జయింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు.గాయపడిన విద్యార్థుల్ని బయటకు తీశారు. కారు, లారీని గుద్ది ఇరుక్కుపోవడంతో, కారులో చిక్కుకున్న క్షతగాత్రుల్ని బయటకు తీసేందుకు కార్‌ను కట్ చేయాల్సి వచ్చింది. అనంతరం విద్యార్థుల్ని వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆ విద్యార్థులు మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో ఎనిమిది మంది విద్యార్థుల మృతదేహాల్ని పోస్టుమార్టం కోసం త్రిశూర్ మెడికల్ కాలేజీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్న్?న్నారు.



# ధైర్యంగా ఉండు తమ్మి.. త్వరలోనే మీ ఇంటికి వస్తా..

పెనుబల్లి, ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 5

బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ యువకుడికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొండంత ధైర్యం చెప్పారు. "భయపడకు తమ్మీ.. ధైర్యంగా ఉండు.. నీకు, నీ కుటుంబానికి మేమంతా అండగా ఉంటాం" అంటూ వీడియోకాల్‌లో ఆప్యాయంగా మాట్లాడారు. చికిత్సకు ఎంత ఖర్చయినా పార్టీ తరఫున భరిస్తామని భరోసా ఇచ్చారు. తనను ఒక్కసారి కలవాలన్న యువకుడి కోరికకు స్పందిస్తూ.. "త్వరలోనే మీ ఇంటికి వస్తా.. అప్పటివరకు ధైర్యంగా ఉండు" అంటూ హామీ ఇచ్చారు.

### బాధిత కుటుంబానికి సండ్ర అండ

ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం రామచంద్రావుబంజర్‌కు చెందిన బన్నె మణికంఠ యాదవ్ బోన్ క్యాన్సర్‌తో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స కోసం కుటుంబం ఇప్పటికే భారీగా ఖర్చు చేసినట్లు సమాచారం. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో మరింత చికిత్స ఎలా చేయించాలన్న ఆందోళనలో కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన వెంటనే రామచంద్రావుబంజర్‌లోని మణికంఠ ఇంటికి వెళ్లి యువకుడి పరిస్థితిని, కుటుంబ సభ్యుల బాధను తెలుసుకున్నారు.అక్కడి నుంచే సండ్ర వెంకటవీరయ్య కేటీఆర్‌కు ఫోన్ చేసి మణికంఠ ఆరోగ్య పరిస్థితిని వివరించారు. అనంతరం యువకుడితో కేటీఆర్ వీడియోకాల్‌లో మాట్లాడారు. "తమ్మీ.. ధైర్యంగా ఉండు. ఎక్కడ ట్రీట్‌మెంట్ చేయించుకున్నావు? నీకు ఎంత ఖర్చయినా పార్టీ నుంచి భరిస్తాం. నీకు, నీ కుటుంబానికి వీరన్న, నేను అండగా ఉంటాం. ఏం కావాలో చెప్పు.. భయపడకు" అంటూ కేటీఆర్ ధైర్యం చెప్పారు.వీడియోకాల్‌లో మాట్లాడుతున్న సమయంలో మణికంఠ.. "సర్.. మిమ్మల్ని ఒక్కసారి చూడాలి.. నేరుగా మీతో మాట్లాడాలి" అని తన కోరికను కేటీఆర్‌కు తెలిపారు. దీనికి స్పందించిన కేటీఆర్.. "తప్పకుండా తమ్మీ.. త్వరలోనే మీ ఇంటికి వస్తాను. అప్పటివరకు ధైర్యంగా ఉండాలి" అంటూ భరోసా ఇచ్చారు. కేటీఆర్ మాటలతో మణికంఠ భావోద్వేగానికి గురయ్యారు. చెమర్చిన కళ్లతో సంతోషం వ్యక్తం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.





# దుర్గం చెరువు దుస్థితిపై కేటీఆర్ ఫైర్..

## ఫ్యూచర్ సిటీ అంటూ ప్రజెంట్ సిటీని గాలికొదిలేశారని ధ్వజం

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 5

హైదరాబాద్ బ్రాండ్‌గా నిలిచిన దుర్గం చెరువు పరిస్థితి అధ్వానంగా మారడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మాణం అంటూ బిజీగా ఉందని.. ప్రస్తుత సిటీని కాలుష్యం, ఇతర సమస్యల నుంచి కాపాడటంపై దృష్టి పెట్టేందుకు సమయం లేదని ఎద్దేవా చేశారు. ప్రజెంట్ సిటీ ఇప్పుడు సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉందని తెలిపారు.దుర్గం చెరువు ప్రస్తుత పరిస్థితికి సంబంధించిన వీడియోను 'ఇండియన్ టెక్ అండ్ ఇన్‌ఫ్రా' ఎక్స్ ఖాతా ద్వారా చేసిన పోస్టును కేటీఆర్ షేర్ చేశారు. చెరువు నీటి ఉపరితలంపై భారీగా చెత్త పేరుకుపోయిన దృశ్యాలు ఆ వీడియోలో కనిపిస్తున్నాయి. చెరువు పరిసరాలు కూడా చెత్తాచెదారంతో నిండిపోయినట్లు పోస్టులో పేర్కొన్నారు.



# కొత్త ప్రపంచ పటం ..

## ఐక్యరాజ్యసమితి తీర్మానానికి అనుకూలంగా ఇండియా ఓటు

న్యూయార్క్,ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 5




కొత్త ప్రపంచ పటాన్ని రూపొందిస్తున్నారు. దీని కోసం ఐక్యరాజ్యసమితిలో తీర్మానాన్ని పాస్ చేశారు. ఆ తీర్మానానికి ఇండియా అనుకూలంగా ఓటు వేసింది. వివిధ ఖండాలకు చెందిన భూభాగాన్ని మరింత కచ్చితత్వంగా చూపేందుకు కొత్త ప్రపంచ పటాన్ని రూపొందిస్తున్నారు. యూఎన్ జనరల్ అసెంబ్లీలో శుక్రవారం 193 సభ్య దేశాలు ఆ తీర్మానాన్ని ఆమోదించాయి. కరెక్ట్ ద మ్యాప్ అనే తీర్మానాన్ని యూఎన్‌లో ఆమోదించారు. భూగోళంలో ఉన్న ప్రాంతాలను సమంగా చూపించాలన్న ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేపట్టారు. ముఖ్యంగా ఆఫ్రికాను దృష్టిలో పెట్టుకుని కొత్త వరల్డ్ మ్యాప్‌ను రూపొందించారు. టోగో దేశం ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఆ తీర్మానానికి అనుకూలంగా 164 దేశాలు ఓటు వేశాయి. ఈస్టోనియా, జార్జియా, లిథువేనియా, మాల్డోవా, సెర్బియా, ఉక్రెయిన్ దేశాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. కేవలం ఒక్క అమెరికా మాత్రమే ఆ తీర్మానాన్ని వ్యతిరేకించింది.16వ శతాబ్దంలో రూపొందించిన మెర్కేటర్ ప్రొజెక్షన్ ద్వారానే ఇంకా ప్రపంచ వ్యాప్తంగా నావిగేషన్ ప్రక్రియ సాగుతోంది. విద్యా సంస్థలు, మీడియా, డిజిటల్, అఫీషియల్ వ్యవహారాల్లోనూ మెర్కేటర్ మ్యాప్‌ను ఫాలోఅయ్యేవారు. భూమధ్య రేఖకు దూరంగా ఉన్న ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో ఆ మ్యాప్‌లో తేడాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే తాజా మ్యాప్‌తో ఆఫ్రికా, దక్షిణ అమెరికా, దక్షిణాసియా భూభాగాల్లో మార్పులు జరగనున్నట్లు తీర్మానం ద్వారా వెల్లడవుతోంది.యూఎన్ జనరల్ అసెంబ్లీలో ఓటింగ్ సందర్భంగా భారత ప్రతినిధి రఘూ పురి మాట్లాడారు. కచ్చితత్వంతో కూడిన భూగోళ పటాన్ని రూపొందించేందుకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. భౌగోళిక సమాజాన్ని అర్థం చేసుకోవడంలో మ్యాప్‌లు కీలక పాత్ర పోషించనున్నట్లు ఆయన చెప్పారు. ఈక్వల్ మ్యాప్ ఏరియా ప్రొజెక్షన్స్‌కు మద్దతు ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.